# ప్రత్యేక పూజలు, కేక్ కటింగ్‌తో బండి సంజయ్ జన్మదినోత్సవం

**భీమదేవరపల్లి/జూలై11 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, బండి సంజయ్ కుమార్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అనంతరం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బాణాసంచా కాలుస్తూ సంబరాలు





నిర్వహించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణలో బీజేపీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి బండి సంజయ్ కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. వీరభద్ర స్వామి ఆశీస్సులతో దేశ ప్రజలకు, ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు మరింత సేవ చేసేలా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, రసూల్‌పల్లె సర్పంచ్ బోయినీ మహేష్, గుండెల్లి సదానందం, పయ్యావుల రాజు, కంకణ సదానందం, మేకల రాజు, తీగల రాజు, శనిగరపు ఐలయ్య, లక్కిరెడ్డి మల్లారెడ్డి, ములుగు సంపత్, రామారావు భద్రయ్య, అయిత సాయి తేజ, దొంగల రానా ప్రతాప్, బొల్లంపల్లి శ్యామ్, సింగం రాజేందర్, రామారావు అర్జున్, గణేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయానికి రూ.1.20 లక్షల విలువైన రంగులు విరాళం



**తల్లాడ, /జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన దాత వై. ప్రసాద్ రూ.1.20 లక్షల విలువైన రంగులను విరాళంగా అందజేశారు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన ఆయన దేవాలయ కమిటీకి రంగులను అధికారికంగా అందించారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రసాద్ చేసిన విరాళం ఆలయ సుందరీకరణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి భాస్కరాచారి, ఆలయ చైర్మన్ ధమాలపాటి బాబు, దీవెల సత్యనారాయణ, నరసింహారావు, రాయల రమేష్, హనుమంతరావు, వెంకటయ్యతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# చోరీల కేసు ఛేదించాం : సీఐ విశ్వేశ్వర్

**గీసుగొండ/జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ అంతర్జిల్లా పాతనేరస్థుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు గీసుగొండ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ వెల్లడించారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఏపీలోని నెల్లూరు జిల్లా కొండాపురం మండలం పుట్టిపల్లి గ్రామానికి చెందిన నందిపాటి జార్జ్ అలియాస్ రమణయ్య (64) కొంతకాలంగా ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందుల సాకుతో దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నాడని సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. ఈ క్రమంలోనే వరంగల్ నగరంలోని ఆదర్శ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ




ఇంట్లోకి అర్ధరాత్రి చొరబడి, బీరువా పగులగొట్టి నగలు దోచుకెళ్లాడని పేర్కొన్నారు.

శుక్రవారం రాత్రి జాన్‌పాక గ్రామ పరిసరాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, నిందితుడు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడన్నారు. పోలీసులను చూడగానే కంగారుపడి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వెనుక దాక్కోవడానికి ప్రయత్నించగా అప్రమత్తమైన సిబ్బంది అతడిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారని వివరించారు. స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా నిందితుడు చేసిన చోరీల గుట్టు రట్టయిందని చెప్పారు. నిందితుడి నుంచి ఒక గ్రాము బంగారు ఉంగరం, ఒక జత వెండి కాళ్లపట్టీలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని శనివారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించిందని పేర్కొన్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్ , సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా మాచర్ల కుమారస్వామి



**భీమదేవరపల్లి/జూలై11 (జర్నలిస్ట్ వార్త):** భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట జిల్లా కమిటీని పార్టీ నాయకత్వం ప్రకటించింది. ఈ కమిటీలో భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నియామకానికి ఆమోదం తెలిపిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని మాచర్ల కుమారస్వామి పేర్కొన్నారు.

# కొత్తపేట జిపిలో ఎంపి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం.



**బయ్యారం/,జులై 11.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి.రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా నిధులు తీసుకురావాలనుకున్నప్పుడు స్థానిక సర్పంచులకు తీర్మానాలు ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేశారని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో వివక్షకు తావులేదని స్పష్టం చేశారు.గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి గ్రామ ప్రజలు తరపున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్లమూడి సురేష్, వార్డు సభ్యులు చల్లా సురేష్,బుర్ర దుర్గారావు,బానోతు రాజు,మొండితోక యాకుబ్,మహేష్,వెంకట్రావు, పెనుగొండ పుల్లయ్య,వెంకటేశ్వర్లు,చల్ల కృష్ణ,మహేష్,నరేష్,చల్లా రవి, వీరబాబు,కార్తీక్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు.



**బయ్యారం/,జులై 11.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మేజర్ గ్రామపంచాయతి పరిధిలో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వైర్లకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను పరిశీలించిన సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ విద్యుత్ అధికారులతో మాట్లాడి శనివారం ఉదయం నుంచి విద్యుత్ సిబ్బంది,గ్రామపంచాయతి సిబ్బంది సంయుక్తంగా విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.అదేవిధంగా పంచాయతీలో విద్యుత్ వైర్లు క్రిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడంతో విద్యుత్ సిబ్బందితో మాట్లాడి వైర్లను లాగించారు.చెట్ల కొమ్మలు తొలగింపుతో విద్యుత్ ప్రమాదాల జరగకుండా స్పందించిన సర్పంచ్ ను, విద్యుత్ సిబ్బందిని పలువురు అభినదించారు.

# బాధిత కుటుంబానికి సింగారం సర్పంచ్ చేయూత.



**బయ్యారం/,జులై 11.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో ఐదవ వార్డులో నునావత్ శ్రీను తండ్రి నునావత్ సామ్య అనారోగ్య కారణాల వలన మృతి చెందారు.ఆదివారం దిశ దిన కర్మల కార్యక్రమానికి సింగారం సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ 50 కేజీల బియ్యం అందజేసి వారి కుటుంబానికి చేయూతనందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమతా,వార్డు సభ్యులు చెరుకుపల్లి మనిషా,గుగులోత్ అనూష,మాజీ ఎంపిటిసి కొత్తపల్లి సీతారాములు,మాజీ వార్డ్ నెంబర్ గుగులోత్ చంద్రు నాయక్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకుపల్లి రవి, నాయకులు మహేష్ నాయక్,రమేష్ నాయక్,విజయ నాయక్,వీరన్న, బాల్య,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా మానసిక దివ్యాంగులకు అన్నదానం



**మధిర/, జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** మధిర మండల పరిధిలోని మాటూరుపేట గ్రామపంచాయతీకి చెందిన మురళీకృష్ణసుధా చౌదరి దంపతుల కుమార్తె ముప్పాసాని మిహిర పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాప బాబాయి ముప్పాసాని శివకృష్ణ ఆధ్వర్యంలో మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో శనివారం మానసిక దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా మురళీకృష్ణ, సుధా చౌదరి, శివకృష్ణ మాట్లాడుతూ మిహిర ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, విద్యలో ప్రతిభ కనబర్చి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పుట్టినరోజును మానసిక దివ్యాంగ పిల్లలతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.మదర్ థెరిస్సా సేవాసదనం నిర్వాహకులు, మానసిక దివ్యాంగుల తరపున ముప్పాసాని కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించడం ఆదర్శనీయమని అభినందించారు.

# డ్రగ్స్ మాఫియాపై ఈగిల్ ఉక్కుపాదం

### ఏడాది కాలంగా ఏడుటన్నుల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్ జూలై 11 (జర్నలిస్ట్ వార్త):**
డ్రగ్స్ మాఫియాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత ఏడాదిలో ఏకంగా ఏడు టన్నుల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణను డ్రగ్స్ ట్రాన్సిట్ హబ్‌గా మార్చే ప్రయత్నాలకు చెక్ పెట్టారు. ఈగల్ అధికారులు, ఇంటెలిజెన్స్‌తో దేశవ్యాప్తంగా వరుసగా భారీగా డ్రగ్స్‌ను సీజ్ చేశారు. రాంచీలో 500 కిలోలు, ఒడిశాలో 500 కేజీలు, తాజాగా 385 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల నిఘాతో డ్రగ్స్ రవాణా ముఠా ఆగడాలను ఆటకట్టించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో 385 కేజీల గంజాయిని ఈగల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల పాటు నిఘా ఉంచి డ్రగ్స్ రవాణా ముఠాను ట్రాక్ చేశారు. ఒడిశాలోని జయ్‌పూర్ సమీపంలోని దేవఘాటి నుంచి బయలుదేరిన గంజాయి లోడ్‌ను నిరంతరం ఫాలో అయ్యారు. కోల్‌కతా, ముంబై జాతీయ రహదారిపై గంజాయి వాహనాన్ని ఎన్సీబీ రాయ్‌పూర్ బృందం అడ్డుకుంది. మహారాష్ట్ర, రాజస్థాన్‌కు తరలిస్తున్న గంజాయిని గమ్యానికి చేరకముందే స్వాధీనం చేసుకున్నారు. కేసులో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ మహదేవ్ భీల్‌ను అరెస్ట్ చేశారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఎన్సీబీ అధికారులు ఆపరేషన్ విజయవంతం చేశారు. రాష్ట్ర సరిహద్దులు దాటి డ్రగ్స్ మాఫియాపై ఈగల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ వ్యతిరేక పోరులో కీలక శక్తిగా ఈగల్ అధికారులు మారారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో మరింత దూకుడుగా ఈగల్ అధికారులు చర్యలు చేపట్టారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే వెంటనే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈగల్ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు.

# పర్వతగిరి గురుకుల పాఠశాల నూతన కమిటీ ఎన్నిక



చైర్మన్ నరకుడు స్వప్న రవీందర్



వైస్ చైర్మన్ గణిపాక జోష్నా

**పర్వతగిరి, జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల నూతన కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా ముగిసింది. విద్య కమిటీ చైర్మన్‌గా నరుకుడు స్వప్న, వైస్ చైర్మన్‌గా గణిపాక జోష్న ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా ఐలపాక స్వప్న, గడ్డం స్వప్న, తనుగుల శ్రీవిద్య, వేల్పుల కరుణ, కుమారస్వామి, మల్లికార్జున్, గోపాల్, కుమారస్వామి, ఏకాంబరం తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు తమ వంతు కృషి చేస్తామని, అందరి సహకారంతో గురుకులాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పీఆర్సీ ప్రకటించాలి.. సీపీఎస్ రద్దు చేయాలి

## పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రభుత్వానికి హెచ్చరిక







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ టీఎస్ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పీఆర్టీయూ టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి హెచ్చరించారు. ధర్మసాగర్ మండలంలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం మండల శాఖ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జాన్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.
ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఉద్దేశించి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, బడిపంతుళ్ల సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలు చేసి హక్కులు సాధించిన చరిత్ర పీఆర్టీయూదేనని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పీఆర్సీ, డీఏలు, ఇతర ఆర్థిక బిల్లులను పెండింగ్‌లో ఉంచడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వెంటనే పీఆర్సీ నివేదికను స్వీకరించి 51 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, హైకోర్టు సూచనలు ఉన్నప్పటికీ 2003 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలులో జాప్యం చేయడం అన్యాయమన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేసి పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రమోషన్లు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే పీఆర్టీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని, ఉపాధ్యాయులు అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, బండ రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు సమ్మిరెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రకళ, ఎస్.ఎస్.విన్ శర్మ, మండల నాయకులు సూర్యప్రకాష్, యమునశ్రీ, యాస్మిన్, మొహినుద్దీన్, రాజ్ మహమ్మద్‌తో పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మూగ-చెవిటి చిన్నారులతో ఎమ్మెల్యే పల్లా జన్మదిన వేడుకలు



**ధర్మసాగర్/, జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** జనగాం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ మూగ-చెవిటి పిల్లల పాఠశాలలో శనివారం సేవా కార్యక్రమాల మధ్య ఘనంగా నిర్వహించారు. ధర్మసాగర్ మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు రాజారపు సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకుడు గుడివెనుక దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించిన నాయకులు అనంతరం చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. విద్యార్థులతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల పట్ల సమాజం మరింత బాధ్యతతో వ్యవహరించాలని, వారి విద్యాభివృద్ధి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు గుర్రపు ప్రవీణ్, భరత్, నాగరాజు, పవన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలు లాకింగ్..

## పార్కింగ్‌పై లేని నిఘా




నగరాలు, జిల్లా కేంద్రాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి తోడు, ట్రాఫిక్ పోలీసుల ఏకపక్ష చర్యలు సామాన్య వాహనదారులకు శాపంగా మారాయి. ఎక్కడ చూసినా నో పార్కింగ్ బోర్డులు దర్శనమిస్తుంటాయి. వాహనాన్ని కాస్త అటుఇటుగా నిలిపితే చాలు. నిమిషాల్లో ట్రాఫిక్ క్రేన్లు వచ్చి వాలిపోతున్నాయి. వాహనాలను లాక్కెళ్లడం (లిఫ్టింగ్), భారీగా జరిమానాలు వడ్డించడం నిత్యకృత్యంగా మారింది, అసలు వాహనదారుడు ఎక్కడ పార్క్ చేయాలో చూపించాల్సిన కనీస బాధ్యతను మాత్రం యంత్రాంగం విస్మరిస్తోంది. నో పార్కింగ్ పేరుతో వాహనదారులపై ప్రతాపం చూపే అధికారులు. అసలు సమస్యకు కారణమవుతున్న వ్యాపార సముదాయాలపై ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.
హైదరాబాద్ మహానగరం మొదలుకొని రాష్ట్రంలోని వరంగల్, హనుమకొండ వంటి తదితర జిల్లా పట్టణ కేంద్రాల వరకు ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది. నిబంధనల ప్రకారం ఎలాంటి వ్యాపార సముదాయం, హోటల్, షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్ లేదా ఆసుపత్రి నిర్మించినా. వచ్చే కస్టమర్ల వాహనాల కోసం ఖచ్చితంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలి. మున్సిపల్ చట్టాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. వందలాది వ్యాపార సంస్థలు బేస్‌మెంట్‌లను గోదాములుగానో, అదనపు దుకాణాలుగానో మార్చేసి పార్కింగ్‌కు మంగళం పాడుతున్నాయి. మరికొన్ని చోట్ల కనీస పార్కింగ్ వసతి లేకుండానే బహుళ అంతస్తుల భవనాల్లో వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాంటి భవనాలకు అనుమతులు ఎలా ఇస్తున్నారు? నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు సంయుక్తంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది సామాన్యుడికి అర్థంకాని ప్రశ్న. దుకాణాల వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో కస్టమర్లు తమ వాహనాలను తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్ల పక్కన నిలుపుతున్నారు. దీన్నే అదనుగా భావిస్తున్న ట్రాఫిక్ పోలీసులు. వాహనాలను లాక్కెళ్లి, చలాన్లు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఒక రకంగా వ్యాపారుల తప్పుకు సామాన్య వినియోగదారులు బలవుతున్నారు. ట్రాఫిక్ నియంత్ర జారీ చేసి, వాటిని పునరుద్ధరించేలాణ, రహదారుల క్రమబద్ధీకరణ అవసరమే, అది కేవలం జరిమానాల వసూళ్లకు, వాహనాల లిఫ్టింగ్‌కు మాత్రమే పరిమితం కాకూడదు. అధికారులు మొదట చేయాల్సింది. నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాలు లేని వ్యాపార సముదాయాలపై కఠిన చర్యలు తీసుకోవడం. పార్కింగ్ స్థలాలను అక్రమంగా వేరే అవసరాలకు వాడుకుంటున్న భవన యజమానులకు నోటీసులు చేయాలి. ప్రభుత్వాలు కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణ కేంద్రాల్లో మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్‌లను అందుబాటులోకి తేవలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది తప్ప. కేవలం వాహనాలను లాక్కెళ్లడం వల్ల సామాన్యుడి జేబు ఖాళీ అవ్వడం మినహా ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
సెల్ నంబర్ 9701249103

# ఎస్ఐఆర్ ముమ్మరం..

## ఇంటింటికీ బీఎల్ఓలు తాసిల్దార్ బావు సింగ్



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రక్రియను వేగవంతం చేసేందుకు ధర్మసాగర్ మండలంలోని కరుణపురం, ధర్మపురం, మలక్‌పల్లి గ్రామాల్లో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తహసీల్దార్ బావు సింగ్ ఆదేశాల మేరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేస్తూ, వాటిని నింపించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఫారాలు అందని వారికి వెంటనే అందజేయడంతో పాటు వృద్ధులు, మహిళలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రత్యేక సహాయం అందిస్తున్నారు. అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి అర్హుడి నమోదు పూర్తయ్యేలా అధికారులు, బీఎల్ఓలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పౌరులందరూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. వారి వెంట ఆర్ ఐ వి పి ఓ లు ఉన్నారు

# ఆరుగురిని చంపి నరరూప రాక్షసుడు

## బాలికను బలవంతంగా కారులో తరలింపు

## సిసిటీవీల్లో రికార్డు అయిన దృశ్యాలు



**రంగారెడ్డి,జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మైనర్ బాలికను నిందితుడు రాజ్‌కుమార్ బలవంతంగా ఇంటి నుంచి కారులో తీసుకెళ్తున్న దృశ్యాలు బయటకొచ్చాయి. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్‌కుమార్‌పై మే 16వ తేదీన పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలిక (17)ను వేధించాడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మే 26వ తేదీన అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే శుక్రవారం అతను జైలుపై విడుదలయ్యాడు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మైనర్ బాలిక ఇంటికి వెళ్లాడు. షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని మైనర్ బాలిక (17) ఇంట్లోకి ప్రవేశించి, ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మ అడ్డుపడ్డారు. దీంతో వారిద్దరినీ కత్తితో పొడి చంపాడు. అనంతరం బాలికను దైవాలగూడ సమీపంలోని చెరువు దగ్గరకు తీసుకెళ్లి పీకకోసి హత్య చేశాడు. శనివారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో తన ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్.. కట్టుకున్న భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్(4), దైవీక్షిత్(2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. అనంతరం తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి అందర్నీ చంపేశానని.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని రాజ్ కుమార్ చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అరుణ్ కుమార్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కాగా, పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఆరు హత్యలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

## విమాన సర్వీసులను పెంచాలని కోరిన సిఎం

**హైదరాబాద్,జూలై 11 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు.

